క్లుప్తంగా

కేజీబీవీ విద్యాలయానికి మిక్సీ అందజేత



కేజీబీవీ ఎస్‌ఓకు మిక్సీ అందజేస్తున్న దాత లక్ష్మీనారాయణ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి దాతలసాయం కొనియాడదగినదని కేజీబీవీ ఎస్‌ఓ షేక్.రేష్మ అన్నారు. సీఎస్‌పురం కేజీబీవీ విద్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మీనారాయణ తన సొంత నిధులతో విద్యాలయానికి మిక్సీ సమకూర్చి దాన్ని ఎస్‌ఓ రేష్మకు అందజేశారు. ఈ సందర్భంగా దాత లక్ష్మీనారాయణను ఎస్‌ఓ, సిబ్బంది అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

హనుమంతునిపాడు: రైతులకు 50 శాతం రాయితీపై అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారి కేవీ రమణ తెలిపారు. జనుములు 14 క్వింటాలు, జీలుగలు 20 క్వింటాలు, పిల్లిపెసర 64 క్వింటాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు , పట్టాదార్ పాస్ పుస్తకాలు జిరాక్సులు చూయించి రాయితీపై తెచ్చుకోచ్చన్నారు.

సాయిబాబా విగ్రహం బహూకరణ



బాబా విగ్రహాన్ని అందచేస్తున్న ఇందు కుమార్ శర్మ

కనిగిరి రూరల్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ప్రధాన అర్చకులుగా 35 ఏళ్ల బాబాకు సేవలందించిన స్వర్గీయ సంగుబొట్ల శ్రీనివాసమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వేద పండితుడు ఇందుకుమార్‌శర్మ రూ.6 లక్షల విలువైన బాబా విగ్రహాన్ని బహూకరించారు. సుమారు 12 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని బుధవారం ఆలయ కమిటీకి అందచేశారు. సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర బ్రహ్మణ సంఘ నాయకులు సంగరాజు సాయి మనోజ్, దేవకి శ్రీనివాసులు, ముచ్చర్ల ధర్మ, ఆలయ పూజారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి



కరపత్ర ప్రచారంలో హనుమాన్ యాత్ర కమిటీ

కనిగిరి రూరల్: ఈనెల 23న కనిగిరిలో జరిగే హనుమాన్ శోభయాత్రను విజయవంతం చేయాలని బ్రహ్మణ సంఘ రాష్ట్ర నాయకులు సంగరాజు సాయి మనోజ్, బీజేపీ జిల్లా నాయకులు ఆడిదం అనిల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పలువురు ప్రముఖులను బుధవారం కలిసి హనుమాన్ శోభాయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ కరపత్ర ప్రచారం చేశారు. 23న ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి కొత్తూరు అభయాంజనేయ స్వామి దేవస్థానం వరకు యాత్ర సాగుతుందన్నారు. హనుమాన్ శోభాయాత్రలో హనుమంతుని పది అడుగుల విగ్రహంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

21న మాలకొండ హుండీ లెక్కింపు

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిదేవస్థానం12 వారాల హుండి లెక్కింపు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. 21వ తేదీ ఉదయం 8.30 గంటలకు కొండ మీద ఉన్న కళ్యాణ మండపంలో 12 వారాల హుండీ లెక్కింపు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

26న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పల్లెల పుట్టారెడ్డి అన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రక్తహీనతపై అవగాహన



రక్తపరీక్షలు నిర్వహిస్తున వైద్యులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మంజుల

హనుమంతునిపాడు: సికెల్‌సెల్ రక్తహీనత వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం మెడికల్ ఆఫీసర్ సందీప్ పాఠశాలల్లో అవగాహన కల్పించారు. హనుమంతునిపాడు, సీతారాంపురం, మహ్మదాపురం తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాలబాలికలకు సమావేశాన్ని ఏర్పాటు చేసి సికెల్ సెల్ రక్త హీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రక్తహీనత ఉన్న బాల బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ వ్యాధి ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి సూచించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు, హెల్త్ క్లీనిక్‌సెంటర్ల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు రక్త పూతలు తీశారు.

పీసీపల్లి: సికిల్ సెల్ ఎనిమియాపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి మంజుల అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గడం వంటి సమస్యలు ఉన్న వారు ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎస్ యశిత, లక్ష్మీ సుజాత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్ట్ టీచర్ల కొరత సమస్యను పరిష్కరించాలి



ముళ్లపాడులో ఉపాధ్యాయురాలికి సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న నేతలు

సీఎస్‌పురం(పామూరు): ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత సమస్యను తక్షణం పరిష్కరించాలని యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకట్రావు, షేక్.పాదుషాలు అన్నారు. మండలంలోని ముళ్లపాడు, చింతలపాలెం, నల్లమడుగులతో పాటు పలు పాఠశాలల్లో బుధవారం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. పాఠశాల నిర్వహణ గ్రాంటును తక్షణం విడుదలచేయాలన్నారు. కార్యక్రమంలో పి.నాయబ్‌రసూల్, హెచ్.వీరాంజనేయులు, కె.నాగరాజు, పి.రవీంద్ర, యు.సాంబశివరావు, జి.నాగేంద్ర, యం.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

22న ఏరువాకను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గుజ్జుల బాలిరెడ్డి

కనిగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న శనివారం హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడులో జరిగే ఏరువాక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం కనిగిరి నియోజకవర్గ కన్వీనర్ గుజ్జుల బాలిరెడ్డి అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జుల బాలిరెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడి పంటలు పండాలని, దేశానికి వెన్నుముక అయిన అన్నదాత రైతన్న సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ.. ఏరువాక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఏరువాకలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ రామయ్య, ఎస్‌కే ఖాశింవలి, జీపీ రామారావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న రామారావు

గుడ్లూరు: స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామి పనులపై టెక్నికల్,ఫీల్డు అసిస్టెంట్‌లకు ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కూలీలు ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశాలకు చేరుకొని 10 గంటలు వరకు పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామసభల ద్వారా గుర్తించిన పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మేట్లను సమన్వయం చేసుకుంటూ పనులు చేయించాలన్నారు. పనులు అడిగిన ప్రతి కూలీ పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేఅన్నారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేసుకుంటే కూలీలకు రోజుకు రూ.300 కూలీ పడుతుందన్నారు. మస్టర్లులో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో జరుగుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించారు.

ఉపాధి కూలీలకు కనీసవేతనం మంజూరు చేయాలి

పీసీపల్లి: ఉపాధి కూలీలకు కనీస వేతనం మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీపీ రామారావు బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూలీలకు కనీస వేతనం ఇవ్వకుండా కోత విధిస్తుందన్నారు. దీంతో కూలీలు ఉపాధి పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600, 200 రోజులు పనిదినాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

99 ఎకరాలు నారసింహునివే..

- రూ.30 కోట్ల విలువైన భూమిపై స్వామి వారికే హక్కులు
- గత ప్రభుత్వంలో జారీ చేసిన ఉత్తర్వులు ఇటీవల రెవెన్యూ అధికారులకు..



మాట్లాడుతున్న ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు

సింగరాయకొండ: పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన సుమారు 30 కోట్ల రూపాయల విలువైన 99 ఎకరాలపై పూర్తి హక్కులు దక్కాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు వెల్లడించారు. స్థానిక వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని బిట్ నంబర్–1 లోని 1123 నుంచి 1156 వరకు సర్వే నంబర్లలో 98.93 ఎకరాల భూమిని 1896లో పర్ణశాల తిరువెంగళాచార్యులు స్వామి వారి పేరుపై రిజిస్టర్డ్ వీలునామా రాశారన్నారు. కానీ ఆ తర్వాత వారి వారసులు ఆ వీలునామా చెల్లదంటూ కోర్టును ఆశ్రయించారని, ప్రస్తుతం ఆ భూమిపై పూర్తి హక్కులు దేవస్థానానికే చెందుతాయని 2023 డిసెంబర్‌లో కోర్టు వెల్లడించిందని పేర్కొన్నారు. సంబంధిత ఉత్తర్వులు తాజాగా మండల అధికారులకు అందాయని, రెవెన్యూ రికార్డుల్లో దేవస్థాన భూమిగా నమోదు చేసేందుకు ఆస్కారం లభించిందన్నారు. ఆ భూమిపై ఏటా ఆలయానికి వేలం ద్వారా 10 లక్షల రూపాయల అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ భూమికి త్వరలో సర్వే చేయించి హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ప్రస్తుతం ఆ భూమిలో మామిడితోటలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారంతో కృషి చేస్తున్నామని వివరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

దొనకొండ: స్థానిక పోస్టాఫీసులో ఐదు రోజుల నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ ఇంటర్‌నెట్ ఆన్‌లైన్ సేవలు ఆగిపోయాయి. వివిధ పనుల కోసం గ్రామాల నుంచి పోస్టాఫీసుకు వచ్చిన వినియోగదారులకు కంప్యూటర్‌లు పని చేయక పోవటంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పోస్టాఫీసులో పోస్టల్, పార్శిల్ బుకింగ్, రిజిష్టర్ పోస్ట్, ఆర్‌డీ చెల్లింపులు, ఆధార్, ఇన్సూరెన్స్ తదితర సేవలు వినియోగదారులకు అందిస్తుంటారు. 5 రోజుల నుంచి ఆ సేవలకు సెలవు. బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు పట్టించుకోక పోవడంతో పోస్టల్ ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ వారిపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు స్పందించి ఆన్‌లైన్ సేవలు వెంటనే జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామాల్లోని ఖాతాదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్న అధికారులు

లింగసముద్రం: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో నేను బడికి పోతా పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టారు. ఎంఈఓ2 శివకుమార్, పలువురు ఉపాధ్యాయులు వెంగళాపురం, శింగరపాలెం, యర్రారెడ్డిపాలెం తదితర గ్రామాల్లో విద్యార్థుల ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారాయని, తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకున్నారు.

పెండింగ్ ఫైల్స్ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషోర్‌రెడ్డి

హనుమంతునిపాడు: ఎన్నికల సందర్భంగా ఆగిన వివిధ ఫైల్స్ పరిశీలించి పెండింగ్ లేకుండా పనులు పూర్తి చేయాలని తహసీల్దార్ కిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవా ద్వారా కానీ, సచివాలయాల నుంచి వచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్లు, కుల ధ్రువీకరణ, ఆదాయం, ఫ్యామిలీ తదితర సర్టిఫికెట్లు పెండింగ్ ఉన్న వాటిని పరిశీలించి పూర్తి చేయాలన్నారు. గురువారం రెవెన్యూ డే సందర్భంగా అందరూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వెంకటనర్సయ్య, పురుషోత్ బాదుర్ల, శ్రీనివాసులరెడ్డి, షేక్ రసూల్, సైదులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంపై ఆసక్తి ఉండాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మంపై ఆసక్తి కలిగి ఉండాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గిద్దలూరు ఖండ కార్యవాహ్ పంటా శివ మల్లారెడ్డి అన్నారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాహితి కళాశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుగా ఉన్న ప్రతి ఒక్కరూ గర్వంగా జీవించాలన్నారు. హిందూ ధర్మం జాగరణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ధర్మాన్ని రక్షించుకుంటూ ఎదుటి వారికి సేవ చేయాలనే ఆలోచనలో ప్రతి ఒక్కరం జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు



రోడ్డు మధ్యలో ఏర్పడిన లోతైన గుంత

జేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట డ్రైనేజీ నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డు వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు భాగంలో డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం కొంతమేర రోడ్డు నిర్మించకుండా వదిలి పెట్టారు. ఇక్కడ నీరు రోడ్డుపైకి పారుతుండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మధ్యలో లోతైన గుంత ఉండటంతో పాటు మురికినీరు ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని చిన్నపాటి చప్టా నిర్మాణం చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



బుక్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

అంగన్‌వాడీలు అమ్మఒడి లాంటివి

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడి లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని బుక్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కేంద్రంలో అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరనున్న చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులను ఉద్దేశించి సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం వివరాలు ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సంతానం కలుగుతారన్నారు. అదేవిధంగా పుట్టిన తరువాత కూడా పౌష్టికాహారం తల్లులు, పిల్లలు తీసుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యంతోపాటు పిల్లల్లో ఎదుగుదల ఆశాజనకంగా ఉంటుందన్నారు. 3 ఏళ్లు నిండిన పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని వారికి సూచించారు. ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు బి.ప్రదీప్, షేక్.షాన్వాజ్, ఎం లక్ష్మీనారాయణమ్మ, భాగ్యలక్ష్మి, అమల, జ్యోతి, సుభాషిణి, ఏజీ అసిస్టెంట్ ఆంజనేయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

కందుకూరు: పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలను వెంటనే గుర్తించి వాటికి నోటీసులు జారీ చేయాలని, అనుమతులు ఉల్లంఘన జరగకుండా వెంటనే సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. తాత్కాలిక ఆక్రమణ పన్ను వసూలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణదారులను గుర్తించి ఆక్రమణ విధించాలని, సంబంధిత వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు విధిగా ఉదయం 8 గంటల కల్లా వారి పరిధిలోని అనధికారిక లేఅవుట్లు, నిర్మాణాలు గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కట్టడాలకు సంబంధించి ఎటువంటి డీవియేషన్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పనిచేయని సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దాతల సహకారం అభినందనీయం



సాలిపేటలో విద్యార్థులకు పుస్తకాల కిట్ అందచేస్తున్న సర్పంచ్, ఎంఈఓలు

గుడ్లూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓలు కె.శ్రీనివాసులు, ఎం.గోవర్ధన్‌లు అన్నారు. మండలంలోని సాలిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ చాపల రమణయ్య అందచేసిన నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులను విద్యార్థులకు ఎంఈఓలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలుతో పాటు నాణ్యమైన విద్యను బోధిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలన్నారు. సర్పంచ్ చాపల రమణయ్య మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, వారికి ఎంలాటి ఇబ్బందులు లేకుండా తన వంతుగా సహాయసహకారాలు అందిస్తానన్నారు. అనంతరం 27 మంది విద్యార్థులకు రూ.6 వేలు విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు అందచేశారు. .

ఏడో రౌండ్ పొగాకు వేలం ప్రారంభం



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న, శ్రీనివాసరావు

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో బుధవారం ఏడో రౌండ్ వేలం ప్రారంభించినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. జువ్విగుంట, అయ్యవారిపాలెం , తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1445 బేళ్లు వేలానికి ఉంచగా అందులో 1390 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 55 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ.343, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.289.59 పలికింది. వేలంలో 29 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరులో అత్యధిక ధర కేజీ రూ.335

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం అత్యధిక ధర రూ.335 పలికింది. ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాతేటిపాడు, జయవరం గ్రామాల రైతులు 1032 బేళ్లను వేలానికి ఉంచగా 983 కొనుగోలయ్యాయి. 49 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.335, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.284.11 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.